క్లుప్తంగా

దరఖాస్తులు స్వీకరణ

రఘునాథపాలెం: రాపర్తినగర్ టీఎస్డబ్ల్యూఆర్ కాలనీలోని తెలంగాణ మైనార్టీ రెసిడెన్షియల్ బాలికల కళాశాల-1లో పీఈటీ, స్టాఫ్‌నర్స్ పోస్టులు భర్తీ చేయనున్నారు. పీఈటీ పోస్టుకు ఎంపీఈడీ అర్హత ఉన్న మహిళ, స్టాఫ్ నర్స్ పోస్టుకు బీఎస్సీ/జీఎన్ఎం అర్హత, రెండేళ్ల అనుభవం కలిగిన మహిళా అభ్యర్థులు అర్హులని ప్రిన్సిపాల్ అబిదా సల్మా తెలిపారు. ఆసక్తి ఉన్న వారు పూర్తి వివరాలతో 17వ తేదీలోగా కళాశాలలో దరఖాస్తులు అందజేయాలని సూచించారు.

బూత్ కమిటీలతో సమావేశం

ఖమ్మంఅర్బన్: ఖమ్మం కార్పొరేషన్ పరిధిలోని 2, 5వ డివిజన్లలో కొత్త ఓటర్ల నమోదు, జాబితా పరిశీలన చేపట్టాలని సుడా చైర్మన్ బచ్చు విజయ్‌కుమార్ సూచించారు. ఆయా డివిజన్ల బీఆర్ఎస్ బూత్ కమిటీ సభ్యులతో మంగళవారం సమావేశమైన సందర్భంగా ఆయన మాట్లాడారు. అర్హులందరినీ ఓటర్లుగా చేర్పించాలని తెలిపారు. నాయకులు నర్రా ఎల్లయ్య, కుర్రా మాధవరావు, చిలుకూరి కోటి, తొట్టి కొమరయ్య, కోలేటి రాధాకృష్ణ, కొడెం తార తదితరులు పాల్గొన్నారు.

ఫోన్ అందజేత

తిరుమలాయపాలెం: పోగొట్టుకున్న ఫోన్‌ను సీఈఐఆర్ యాప్ ద్వారా గుర్తించి బాధితుడికి మంగళవారం కూసుమంచి సీఐ జితేందర్‌రెడ్డి, ఎస్ఐ వరాల శ్రీనివాస్ అందజేశారు. గత నెల రోజుల క్రితం విద్యుత్‌శాఖలో పనిచేస్తున్న నెహంగరావు తన మొబైల్ పోవడంతో స్థానిక పోలీస్‌స్టేషన్ ఫిర్యాదు చేశాడు. దీంతో ఐఎంఈఐ నంబర్ ద్వారా ఫోన్‌ను కనిపెట్టి బాధితుడికి అందజేశారు.

'ప్రియదర్శిని'లో క్యాంపస్ ఇంటర్వ్యూలు



ఎంపికైన విద్యార్థినులతో అధ్యాపకులు

ఖమ్మంరూరల్: మండలంలోని పెదతండాలో గల ప్రియదర్శిని ఇంజనీరింగ్ మహిళా కళాశాలలో మంగళవారం హైదరాబాద్‌కు చెందిన మైండ్ స్పార్క్ వారిచే మంగళవారం విద్యార్థినులకు క్యాంపస్ నియామకాలు జరిగాయి. ఈ సందర్భంగా కంపెనీ సీనియర్ మేనేజర్ వినయ్ జాక్సన్ ఆధ్వర్యాన బృంద చర్చలు, ఇంటర్వ్యూలు నిర్వహించి విద్యార్థినులను ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల చైర్మన్ కె.నవీన్‌బాబు, బి.గోపాల్, వివిధ విభాగాల అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

మజ్జిగ పంపిణీ

ఖమ్మంగాంధీచౌక్: నగరంలోని వర్తక సంఘం వద్ద మంగళవారం వేరుశనగ మిల్లుల యజమానుల ఆధ్వర్యాన ఎండ తీవ్రతను దృష్టిలో పెట్టుకొని బాటసారులకు మజ్జిగ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రధాన కార్యదర్శి మెంతుల శ్రీశైలం, ఉపాధ్యక్షుడు సోమా నర్సింహారావు, సహాయ కార్యదర్శి మన్నెం కృష్ణతో పాటు కల్వకుంట్ల గోపాల్‌రావు, రాయపూడి శ్రీధర్, తూములూరి లక్ష్మీనరసింహారావు పాల్గొన్నారు.

వ్యక్తిగత విమర్శలు మానుకోవాలి



విలేకరులతో మాట్లాడుతున్న నాయకులు

కూసుమంచి: కాంగ్రెస్ పార్టీకి చెందిన వారిపై బీఆర్ఎస్ నాయకులు వ్యక్తిగత విమర్శలు చేయడం సబబు కాదని నాయకులు పేర్కొన్నారు. మంగళవారం రాత్రి కూసుమంచిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నాయకులు ఎడవెల్లి రాంరెడ్డి, ఎండీ హఫీజుద్దీన్ మాట్లాడారు. ఇటీవల ముత్యాలగూడెం గ్రామంలో ఎమ్మెల్యే కందాల ఉపేందర్‌రెడ్డి కారుపై రాళ్లదాడి జరిగిన సంఘటనలో కాంగ్రెస్ వాళ్లకు ఎటువంటి సంబంధం లేదని, పోలీసులు నిష్పక్షపాతంగా విచారణ చేపట్టాలని కోరారు.వారు తమ తప్పులు కప్పిపుచ్చుకునేందుకే వ్యక్తిగత దూషణలకు దిగుతున్నారని అన్నారు. బీఆర్ఎస్ నాయకుల ప్యాకేజీల ఆరోపణలకు బహిరంగ చర్చకు సిద్ధమని సవాల్ విసిరారు. ఈ సమావేశంలో నాయకులు దాసరోజు వెంకన్న, ఎర్రబోయిన వీరభద్రం, వనం మధుసూదన్, అంజయ్య, కలీమ్, నాగేశ్వరరావు, సుధాకర్, పాపారావు, కిరణ్, సత్యం, సైదా తదితరులు పాల్గొన్నారు.

నగరంలో సినిమాలు

వినోద	టక్కర్
సాయిరాం	ట్రాన్స్‌ఫార్మర్స్
ఆదిత్య	బిచ్చగాడు 2
శ్రీనివాస	అన్ స్టాపబుల్
సుందర్	విమానం

- ఖమ్మంగాంధీచౌక్

మురుగు.. ముప్పు!



ఎన్నెస్పీ క్యాంపులోని కచ్చా కాల్వలో పేరుకుపోయిన మురుగు

వర్షాకాలం వస్తున్నా డ్రెయినేజీలపై దృష్టి సారించని కేఎంసీ

- మురుగు తొలగింపునకు ముందస్తు ప్రణాళిక కరువు..
- గడ్డితో పూడుకుపోయిన కచ్చా కాల్వలు
- చినుకు పడితే వర్షపు నీరు రోడ్డెక్కాల్సిందే..
- పలు కాలనీల్లో ఇళ్లల్లోకి చేరనున్న వరద నీరు

ఖమ్మంమయూరిసెంటర్: వర్షాకాలం వస్తుందంటే నగరంలో ముందస్తుగా గుర్తొచ్చేది డ్రెయినేజీల సమస్య. అవి సక్రమంగా లేకపోవడంతో ఏ చిన్నపాటి వర్షం కురిసినా.. నీరంతా రోడ్లపైకి, ఇళ్లల్లోకి వస్తుందని లోతట్టు ప్రాంతాలు, డ్రెయినేజీలు లేని ప్రాంతాల ప్రజలు ఆందోళనకు గురవుతుంటారు. నగరంలోని విలీన గ్రామ పంచాయతీలతో పాటు నగర శివారు ప్రాంతాల్లో ఈ సమస్య అధికంగా ఉంటుంది. ఇక నగరంలోని పలు ప్రాంతాల్లో డ్రెయినేజీల నిర్వహణ సక్రమంగా లేకపోవడంతో నీరు బయటకు వెళ్లే పరిస్థితి లేక డ్రెయిన్లలోని మురుగు, వర్షపు నీరు రోడ్లపైకి చేరి రోడ్లన్నీ మురుగుతో నిండడం సర్వసాధారణమైంది. ఈసారి వేసవి కాలం ముగుస్తుండడం, నాలుగైదు రోజుల్లో వర్షాలు మొదలయ్యే అవకాశం ఉన్నా.. నేటి వరకూ ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ అధికార యంత్రాంగం డ్రెయినేజీలను శుభ్రం చేయించే పనులపై దృష్టి సారించలేదు. కనీసం మాన్సూన్ యాక్షన్ ప్లాన్ కూడా రూపొందించలేదని తెలుస్తోంది. ఈ విషయమై అడిగితే కేఎంసీలో ఒక్కో అధికారి ఒక్కో మాదిరిగా సమాధానాలు చెబుతున్నారు.

పూడుకుపోయిన డ్రెయిన్లు..

నగరంలోని డ్రెయినేజీలు ప్లాస్టిక్ వ్యర్థాలతో పూడుకుపోతున్నాయి. డ్రెయినేజీల్లోని మురుగుతో పాటు ప్లాస్టిక్ వ్యర్థాలు, ఇతర వస్తువులను కార్మికులు కొన్ని రోజులుగా తొలగించకపోవడంతో మురుగు నీరు సాఫీగా ముందుకు సాగకుండా వ్యర్థాలతో నిండిపోయాయి. ప్రధానంగా జవాన్లు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ల నిర్లక్ష్యంతోనే ఈ సమస్య ఎదురవుతోందని చెబుతున్నారు. ఫలితంగా వర్షాలు పడినప్పుడల్లా డ్రెయిన్లలో మురుగు, వర్షపు నీరు వెళ్లే మార్గం లేక రోడ్లపైకే కాక లోతట్టు ప్రాంతాల్లోకి నీరు చేరుతుందని ప్రజలు వాపోతున్నారు.

వర్షం వస్తే నరకమే..

డ్రెయినేజీలు సక్రమంగా లేకపోవడంతో వర్షం వస్తే పొంగి పొర్లుతున్నాయి. దీంతో నగరంలోని ప్రధాన ప్రాంతాల్లోని రోడ్లపైకి మురుగు చేరడం సాధారణమైపోయింది. ఇటీవల మయూరిసెంటర్, బాబురావు పెట్రోల్‌బంక్ ఎదురుగా నూతన డ్రెయినేజీలు నిర్మించినా, ఇంకా పలు ప్రాంతాల్లో డ్రెయిన్లను ఆధునీకీకరించకపోవడం, శుభ్రం చేయకపోవడంతో మురుగు నీరు రోడ్లపైకి వచ్చే ప్రమాదం ఉంది. కమాన్‌బజార్, కస్బాబజార్, క్రైం పోలీస్‌స్టేషన్ రోడ్డు, గాంధీచౌక్, ఐటీ హబ్ ప్రాంతాల్లో డ్రెయిన్లు ఆయా ప్రాంతాల్లోని రోడ్లన్నీ డ్రెయినేజీలను తలపిస్తాయి. వర్షం తగ్గాక రోడ్లపై మురుగు అలానే ఉండడంతో పాదచారులు, వాహనదారులు, నివాసులకు ఏటా తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

కేఎంసీలో డ్రెయినేజీ వ్యవస్థ ఇలా..

వివరాలు	నిడివి (కి.మీ.ల్లో)
ఓపెన్ డ్రెయినేజీ	1,075
స్టోమ్ వాటర్ డ్రెయినేజీ	50.5
కచ్చా డ్రెయినేజీ	476
మొత్తం డ్రెయినేజీ	1,601.5

చిన్నచిన్న డ్రెయిన్లతో సమస్య..

ఖమ్మం నగరపాలక సంస్థగా రూపాంతరం చెందినా అనేక డివిజన్లలో ఇంకా చిన్నచిన్న డ్రెయినేజీలే ఉన్నాయి. పలు డివిజన్లలో సీసీ డ్రెయిన్లు లేకపోవడంతో కచ్చా కాల్వలను తీసి వాటి ద్వారా మురుగు, వర్షపు నీరు బయటకు పంపిస్తున్నారు. కానీ ఇవి చిన్నవిగా ఉండడంతో వరద నీరు బయటకు వెళ్లే పరిస్థితి లేక రోడ్లపైకి చేరుతుండడంతో ప్రజలు ఇబ్బందులు పడాల్సి వస్తోంది. పలు డివిజన్ల కొత్తగా నిర్మించిన, అంతకముందు నిర్మించిన డ్రెయినేజీల నుంచి నీరు బయకు పోయేందుకు ప్రధాన డ్రెయినేజీలకు లింక్ చేయకపోవడంతో వృథాగా మారాయి. రాపర్తినగర్‌లో రోడ్డు వెంట నిర్మించిన డ్రెయినేజీకి లింక్ కలపకపోవడంతో వర్షం వచ్చినప్పుడల్లా అక్కడ ప్రజలు ఇబ్బందులు తప్పట్లేదు.



బుర్హాన్‌పురంలోని డ్రెయినేజీలో పేరుకుపోయిన ప్లాస్టిక్ బాటిళ్లు, కవర్లు, సిల్ట్

డ్రెయిన్లను శుభ్రం చేయిస్తున్నాం..

నగరంలోని అవసరమైన చోట్ల నూతన డ్రెయినేజీలను నిర్మిస్తున్నాం. సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించి తొలుత అక్కడ పనులు చేపట్టాం. సిల్ట్ పేరుకుపోయిన ప్రధాన డ్రెయినేజీలను గుర్తించి వాటిని శుభ్రం చేయిస్తున్నాం. లకారం చెరువు పక్కన ప్రధాన డ్రెయినేజీలో సిల్ట్ తొలగింపు పనులు చివరి దశకు చేరాయి. ఇంకా ఎక్కడైనా ఇలాగే ఉంటే శుభ్రం చేయిస్తాం.

– ఆదర్శ్ సురభి, కమిషనర్, కేఎంసీ

మహిళా సంక్షేమానికి పెద్దపీట

ఖమ్మంరూరల్: రాష్ట్ర ప్రభుత్వం మహిళా సంక్షేమానికి పెద్దపీట వేస్తుందని ఎమ్మెల్యే కందాల ఉపేందర్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో జరిగిన దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన మహిళా సంక్షేమ దినోత్సవంలో ఎమ్మెల్యే మాట్లాడారు. ఆడబిడ్డల అభివృద్ధికి కల్యాణలక్ష్మి, షాదిముబారక్ పథకాలు అమలు చేస్తూ పెద్దన్నగా సీఎం కేసీఆర్ అన్నీ తానై నిలుస్తున్నారని, మరోసారి కేసీఆర్‌ను సీఎం చేయడానికి మహిళలు అండగా నిలవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ తాతా మధు, ఎంపీపీ బెల్లం ఉమ, జెడ్పీటీసీలు ఏ. వరప్రసాద్, ఇంటూరి బేబి, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు బెల్లం వేణు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కందాల ఉపేందర్‌రెడ్డి..

గంగాభవానితల్లి జాతరలో ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు..

తిరుమలాయపాలెం: మండలంలోని రాజారం గ్రామంలో నిర్వహించిన గంగాభవాని తల్లి జాతర మహోత్సవంలో ఎమ్మెల్యే కందాల ఉపేందర్‌రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బాణాల వెంకటరెడ్డి, యాదవ కుల పెద్దలు వేల్పుల మల్లయ్య, గుండాల సైదులు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

మహిళా ఉద్యోగులకు సన్మానం..

రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మంగళవారం పలు ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలు, దేవాలయాల్లో మహిళా సంక్షేమ దినోత్సవం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయా సంస్థలు, ఆలయాల్లో పనిచేస్తున్న మహిళా ఉద్యోగులను శాలువాలు కప్పి సన్మానించి పలువురికి ప్రశంసా పత్రాలు అందించారు. అనంతరం మహిళాభివృద్ధికి ప్రభుత్వ చేస్తున్న కృషిని పలువురు నాయకులు, అధికారులు వివరించారు. – సాక్షి నెట్‌వర్క్



ఖమ్మంమయూరిసెంటర్: మంత్రి క్యాంపు కార్యాలయంలో చైల్డ్‌లైన్ చైర్‌పర్సన్ భారతిని సన్మానిస్తున్న మేయర్ నీరజ, తదితరులు



ఖమ్మంగాంధీచౌక్: కాల్వొడ్డు వీరాంజనేయ స్వామి ఆలయంలో సన్మానిస్తున్న ఆలయ కమిటీ ప్రతినిధులు



ఖమ్మం సహకారనగర్: సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ కార్యాలయం ఫోరం ఆధ్వర్యంలో మహిళా ఉద్యోగులను సన్మానిస్తున్న టీఎన్జీవోస్ బాధ్యులు



ఖమ్మం అర్బన్: నీటిపారుదల, ఆయకట్టు అభివృద్ధి శాఖ ఉద్యోగులను సన్మానిస్తున్న దృశ్యం

సభను విజయవంతం చేద్దాం..

సన్నాహక సమావేశాల్లో బీజేపీ నాయకులు

ఖమ్మం మామిళ్లగూడెం: బీజేపీ ఆధ్వర్యాన ఖమ్మం ఎస్ఆర్ అండ్ బీజీఎన్ఆర్ కళాశాల మైదానంలో గురువారం భారీ బహిరంగ సభ నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈమేరకు సభ విజయవంతానికి నాయకులు కసరత్తు చేస్తూ మంగళవారం పలు ప్రాంతాల్లో సన్నాహక సమావేశాలు నిర్వహించారు. ఈసందర్భంగా బీజేపీ జిల్లా కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు గల్లా సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో పార్టీ తమిళనాడు సహ ఇన్‌చార్జి పొంగులేటి సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ సభను విజయవంతం చేయటానికి ప్రతి ఒక్కరు కృషిచేయాలని కోరారు. అలాగే, నగరంలోని పలు డివిజన్ల కార్యకర్తలతో నాయకులు సమావేశమై జన సమీకరణ, వాహనాల ఏర్పాటుపై సూచలను చేశారు. అనంతరం జరుగుతున్న ఏర్పాట్లను పోలీసు అధికారులతో కలిసి నాయకులు పరిశీలించి పార్కింగ్, ట్రాఫిక్ మళ్లింపుపై చర్చించారు. పార్టీ రాష్ట్ర, జిల్లా నాయకులు రవీంద్రనాయక్, కొండపల్లి శ్రీధర్‌రెడ్డి, రాణిరుద్రమదేవి, కడగంచి రమేష్, సన్నె ఉదయ్‌ప్రతాప్, వీరూగౌడ్, ప్రదీప్, దొంగల సత్యనారాయణ, గెంటెల విద్యాసాగర్, ఉప్పల శారద, డాక్టర్ శీలం పాపారావు, సతీష్, నున్నా రవికుమార్, కిరణ్, మంద సరస్వతి, వీరభద్రం, ఆచంటి కోటేశ్వరావు, రేఖ వెంకటసత్యనారాయణ, వెంకటనారాయణ, చంద్రశేఖర్, ఉపేందర్‌గౌడ్, దేవకి వాసుదేవరావు, మహేందర్‌సింగ్, విద్యాసాగర్‌రెడ్డి, రాజేష్, నూకల రామ్మోహనరెడ్డి, నల్లగట్టు ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు. కాగా, బీజేపీ మహిళా నాయకులు పలు డివిజన్లలో పర్యటించి సభకు రావాలని కోరుతూ బొట్టు పెట్టి ఆహ్వానించారు.



ఏర్పాట్లను పరిశీలిస్తున్న పొంగులేటి, నాయకులు

సభను విజయవంతం చేయండి..

కూసుమంచి: ఖమ్మంలో గురువారం జరగనున్న బీజేపీ సభకు తరలిరావాలని పార్టీ మండల అధ్యక్షుడు బజ్జూరి మల్లారెడ్డి కోరారు. కూసుమంచిలో మంగళవారం జరిగిన సమావేశంలో నాయకుడు గడ్డం వెంకటేశ్వర్లుతో కలిసి ఆయన మాట్లాడారు. కేంద్ర హోం మంత్రి అమిత్‌షా హాజరుకానున్న ఈ సభను విజయవంతం చేయాలని కోరారు.

మెకానిక్‌కు ఆర్థిక సాయం



ఆర్థిక సాయమందిస్తున్న కొండల్‌రావు

ఖమ్మంఅర్బన్: ఖమ్మం కార్పొరేషన్ టూవీలర్ మెకానిక్ అసోసియేషన్ ఆధ్వర్యానఇటీవల ప్రమాదంలో గాయపడిన మెకానిక్ ఉదరి కిరణ్‌కు మంగళవారం ఆర్థిక సాయమందించారు. గత పదేళ్లుగా కాలు విరిగి ఇంటి దగ్గర ఉంటూ ఆర్థిక ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో అసోసియేషన్ ద్వారా రూ.10 వేలు ఆర్థిక సాయం జిల్లా సంఘ అధ్యక్షుడు వంగాల కొండల్‌రావు ద్వారా అందించారు. ఈ కార్యక్రమంలో అప్పారావు, శ్రీను, మురళీ, రమేష్, గంగరాజు, వెంకట్, లాలయ్య తదితరులు పాల్గొన్నారు.

17న గిరిజనులందరూ ఖమ్మం తరలిరండి

ఖమ్మంఅర్బన్: ఈనెల 17న ఖమ్మం లకారం ట్యాంక్ బండ్‌పై తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధుడు జాటోత్ ఠానునాయక్ విగ్రహావిష్కరణకు గిరిజనులందరూ తరలిరావాలని ఠానునాయక్ విగ్రహావిష్కరణ కమిటీ నేతలు పిలుపునిచ్చారు. మంగళవారం బంజారా భవన్‌లో నిర్వహించిన సమావేశంలో భూక్యా వీరభద్రం, బానోత్ కిషన్, ధరావత్ రాంమ్మూర్తి, బోడ వీరన్న, అజ్మీర సుశీల, బానోత్ రాజులు మాట్లాడారు. అదేరోజు ఠానునాయక్ పోరాట స్ఫూర్తితో ఖమ్మంలో ఐటీడీఏ సాధించడమే లక్ష్యంగా ఖమ్మం పటేల్ స్టేడియం నుంచి నిర్వహించే ప్రదర్శనకు గిరిజనులందరూ కదిలి వచ్చి జయప్రదం చేయాలని కోరారు. బానోత్ బస్కినాయక్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో భూక్యా శోభన్ బాబు, భూక్యా నాగేశ్వరరావు, నెహ్రూ, బానోత్ జగన్నాథం, అజ్మీర కిషన్ బానోత్ చంద్రం, బోడా మోహన్ తదితరులు పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాలు కల్పించాలి

ఖమ్మంమయూరిసెంటర్: ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఇటికాల రామకృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం నగరంలో నిర్వహించిన ఏఐఎస్ఎఫ్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలలు ప్రారంభమైన నేపథ్యాన ప్రభుత్వ విద్యకు పేద వర్గాల విద్యార్థులను దూరం చేసేందుకు, పాఠశాలల అభివృద్ధికి ప్రభుత్వం, ప్రభుత్వ అధికారులు చొరవ చూపాలన్నారు. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా సహకాలంలో పాఠ్యపుస్తకాలు అందించాలని, ప్రతీ విద్యార్థికి నాలుగు జతల ఏకరూప దుస్తులు అందించాలని డిమాండ్ చేశారు. తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం ఫీజుల నియంత్ర చట్టం అమలు చేయకపోతే ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యాన రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనకు సిద్ధమవుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు ధర్మవరపు యువరాజ్, సహాయ కార్యదర్శి ఆలోచి శివనాయక్, చందులాల్, నరేష్, వెంకటేష్, గోపి, నరేష్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఇటికాల రామకృష్ణ

అథ్లెట్‌కు కలెక్టర్ సన్మానం



మైథిలిని సన్మానిస్తున్న కలెక్టర్ వీ.పీ. గౌతమ్

ఖమ్మంస్పోర్ట్స్: జాతీయ స్థాయిలో రాణించిన జిల్లా అథ్లెటిక్స్ క్రీడాకారిణి ఎ.మైథిలిని జిల్లా కలెక్టర్ వీ.పీ.గౌతమ్ మంగళవారం ఘనంగా సన్మానించారు. గతంలో జరిగిన జూనియర్, సీనియర్ జాతీయ స్థాయి పోటీల్లో పలు పతకాలు సాధించిన ఏకైక అథ్లెట్‌గా ఆమెను గుర్తించి సన్మానించారు. ఈ కార్యక్రమంలో మేయర్ పునుకొల్లు నీరజ, మున్సిపల్ కమిషనర్ ఆదర్శ్ సురభి, సుడా చైర్మన్ బచ్చు విజయ్‌కుమార్, అథ్లెటిక్స్ కోచ్ ఎండీ గౌస్ పాల్గొన్నారు.

జయప్రదం చేయండి

నేలకొండపల్లి: తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా నేడు(బుధవారం) జరగనున్న ఆరోగ్య ఉత్సవాలను జయప్రదం చేయాలని స్థానిక ప్రభుత్వ వైద్యాధికారి ఆర్.శ్రావణ్‌కుమార్ పిలుపునిచ్చారు. ప్రభుత్వాస్పత్రిలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఖమ్మం రూరల్ మండలంలోని రామ్‌లీలా ఫంక్షన్ హాల్‌లో ఈ వేడుకలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ విలేకర్ల సమావేశంలో వైద్యాధికారి శేషాద్రి, సీహెచ్ఎన్ దుర్గ తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన విత్తనాలు అందించాలని వినతి



వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

తిరుమలాయపాలెం: రైతాంగానికి నాణ్యమైన విత్తనాలు అందేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ ఏఐకేఎంఎస్ ఆధ్వర్యాన మంగళవారం తహసీల్దార్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ లక్ష్మణ్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా నాయకుడులు తిమ్మిడి హన్మంతరావు మాట్లాడుతూ.. పంటల దిగుబడిలో వ్యాపారులు నకిలీ విత్తనాల పేరుతో దోపిడీ చేసి రైతులను అన్యాయం చేస్తున్నారన్నారు. రైతులకు కావాల్సిన ఎరువులను సబ్సిడీపై అందించాలని, రుణాలను మాఫీ చేసి కొత్త రుణాలు ఇవ్వాలని, పంటల బీమా పథకాన్ని అమలుచేయాలని కోరారు. ప్రభుత్వం కొనుగోలు చేసిన వరి, మొక్కజొన్న పంటల డబ్బులను రైతులకు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు ఎలమంచి, వెంకన్న, రామచంద్రు, తిమ్మిడి వెంకన్న, ఉప్పలి, సీత తదితరులు పాల్గొన్నారు.

గురుకులంలో సంబరాలు..

నేలకొండపల్లి: తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా 10 రోజుల పాటు సంబరాలు నిర్వహించేందుకు గురుకుల సంస్థ అధికారులు కార్యాచరణ రూపొందించారు. తొలి రోజు మంగళవారం నేలకొండపల్లి గురుకుల పాఠశాల విద్యార్థినులు మానవహారం చేపట్టారు. సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. జాతీయ జెండాను మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ వెంకన్న ఎగురవేసి మాట్లాడారు. రాష్ట్రం వచ్చిన తర్వాత ఎంతో మంది విద్యార్థుల భవిష్యత్‌కు గురుకులాలు మార్గం చూపాయని, గురుకులాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల వైస్ ప్రిన్సిపాల్ ప్రమీల, ఉపాధ్యాయులు, విద్యార్థినుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.



మానవహారం నిర్వహిస్తున్న విద్యార్థినులు

సమస్యలు పరిష్కరించకపోతే ఆందోళన



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఖమ్మంమయూరిసెంటర్: నగరంలోని 44వ డివిజన్‌లో నెలకొన్న ప్రజా సమస్యలపై స్థానిక కార్పొరేటర్ తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు వై.విక్రమ్ విమర్శించారు. మంగళవారం డివిజన్‌లో నెలకొన్న నీటి ఎద్దడి సమస్యపై సీపీఎం టూ టౌన్ కమిటీ ఆధ్వర్యాన కార్పొరేషన్ కార్యాలయం మేనేజర్‌కు వినతిపత్రం సమర్పించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. భక్త రామదాసు కళాక్షేత్రం గుట్ట ప్రాంతంలోని పీఆర్‌టీయూ కార్యాలయం రోడ్, పైన వున్న గుట్ట ప్రాంతంలో మంచి నీరు రాకుంటే కార్పొరేటర్ కనీసం స్పందించే పరిస్థితి లేదన్నారు. వాటర్ ట్యాంక్‌లు కట్టించడంలో పాటు 24 గంటలు తాగునీరు వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని, లేకుంటే సమస్యల పరిష్కారం కోసం ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ టూ టౌన్ కార్యదర్శి బోడపట్ల సుదర్శన్, నాయకులు నాగరాజు, జాలా శ్రీను, లక్ష్మీనారాయణ, వాణి, లక్ష్మి, రమణ పాల్గొన్నారు.

వరిసాగుపై అవగాహన

ఖమ్మంరూరల్: మండలంలోని గొల్లగూడెంలో ముందస్తు వరిసాగుపై మంగళవారం రైతులకు అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఏడీఏ విజయ్‌చంద్ర మాట్లాడుతూ.. దీర్ఘకాలిక, మధ్యకాలిక రకాలను స్వల్పకాలిక రకాలుగా ఎంచుకొని నారు మడులను పోసుకోవాలని తెలిపారు. దీంతో నూకశాతాన్ని తగ్గించవచ్చని, పంట కూడా త్వరగా చేతికొస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఓ వి. నాగేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

నియామకం

ఖమ్మం మామిళ్లగూడెం: జనసేన పార్టీ ఖమ్మం అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా మిరియాల రామకృష్ణ నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ అధ్యక్షుడు పవన్ కల్యాణ్ నియామకపు ఉత్తర్వులు అందజేశారు. తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన ప్రతి ఒక్కరికీ రామకృష్ణ కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన్ను పలువురు అభినందించారు.

నోటీసులు పంపడం హేయం



లీగల్ నోటీసులు చూపిస్తున్న బాధిత రైతులు

కామేపల్లి (కారేపల్లి): బ్యాంక్ ద్వారా రుణం తీసుకొని తిరిగి చెల్లించని రైతులకు కోర్టు ద్వారా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని లీగల్ నోటీసులు పంపడం బీఆర్ఎస్ ప్రభుత్వానికి సిగ్గుచేటని కాంగ్రెస్ పార్టీ కామేపల్లి మండల అధ్యక్షుడు గింజల నర్సింహారెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం పొన్నెకల్ గ్రామంలో బాధిత రైతులతో కలిసి విలేకరులతో ఆయన మాట్లాడారు. కామేపల్లి బ్రాంచ్ ఎస్‌బీఐ పరిధిలోని గ్రామాల్లో పంట రుణాలు తీసుకున్న దాదాపు 1,100 మంది రైతులకు నోటీసులు పంపడం హేయమైన చర్య అన్నారు. రైతుల పక్షాన మండల కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యాన తాళ్లగూడెం ఎస్‌బీఐ బ్రాంచ్ ఎదుట వేలాది మంది రైతులతో ధర్నా కార్యక్రమం చేపడతామని హెచ్చరించారు.

మరణ నివేదిక పత్రాల పంపిణీ



మరణ నివేదిక పత్రాన్ని అందజేస్తున్న దృశ్యం

ఖమ్మం మామిళ్లగూడెం: నగరంలోని వైకుంఠధామాలలో మరణించిన వారి కుటుంబసభ్యులకు కాటికాపరుల ఆధ్వర్యాన మరణ నివేదిక ప్రతాలను మంగళవారం ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కాటికాపరుల జాంబవంతుడు, సొసైటీ ప్రధాన కార్యదర్శి చెరుకుపల్లి బాబు మాట్లాడుతూ.. మరణించిన వ్యక్తి అంత్యక్రియలు తర్వాత మూడు రోజుల్లో ఎలాంటి లాయర్ నోటరీ, గెజిటెడ్ సంతకాలు లేకుండా మరణ ధ్రువపత్రం పొందేందుకు మున్సిపాలిటీ ఉద్యోగి జవాన్‌కు దరఖాస్తు చేసుకునే మరణ నివేదిక పత్రాల కొరత ఏర్పడడం వలన తాము ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు. మరణ నివేదిక పత్రాలను మాజీ కార్పొరేటర్ పాలడుగు పాపారావు బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో సభ్యులు పందివేణు, సైదులు, కాశయ్య, పడిశాల వీరస్వామి, చుక్కయ్య, తరుణ్ పాల్గొన్నారు.